క్లుప్తంగా

నేడు మార్కెట్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ఆత్మకూరు : ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం బుధవారం ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ బీరం సునంద సుధాకర్‌రెడ్డితో పాటు వైస్‌చైర్మన్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుల నియామకం



ఆత్మకూరు: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా మండలానికి చెందిన ఉపాధ్యాయులు కడమండ్ల అనురాధ, బొమ్మెర సోమయ్య, పల్లె దేవేందర్‌రెడ్డి, ఎం.జనార్దన్‌రెడ్డి, అయితె రాజు నియమితులైనట్లు పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అబ్బు బుచ్చిరెడ్డి తెలిపారు. వీరికి పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి నియామక పత్రాలు అందచేశారు. నూతన అసోసియేట్ అధ్యక్షులను మంగళవారం పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు ఎడ్ల ఉపేందర్‌రెడ్డి, కొప్పుల రమేష్ బాబు అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన మోతె రాములు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల నాయకుడు కొయ్యడ మహేందర్ బాధిత కటుంబాన్ని పరామర్శించారు. రాములు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రూ.3 వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రాజు, జగన్, రాజమౌళి, యాదయ్య తదితరులు ఉన్నారు.

అధికారి బదిలీతో ఆనందం

నడికూడ: మండలంలోని ఓ ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసిన ఆ అధికారి బదిలీ కావడంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆ అధికారితో ఏదైనా పని ఉంటే, ఎంతో కొంత ఇస్తేనే పని చేస్తాడని, లేదంటే ఆయన చుట్టూ తిరగాల్సిందని, పలుమార్లు ఇబ్బందులు పడ్డ మండల ప్రజలు తన బదిలీ విషయం తెలిసి సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల విక్రయదారుల కమిటీ ఎన్నిక



బోయిని సాంబయ్య

కమలాపూర్: మండల కేంద్రంలోని గుడిబండ వద్ద ప్రతి రోజు నిర్వహించే కూరగాయల మార్కెట్‌లో కూరగాయల అమ్మకందారులు 'కమలాపూర్ వరలక్ష్మి రైతు సేవక్ కూరగాయల అమ్మకందారుల సంక్షేమ సంఘం' ఏర్పాటు చేసుకుని మంగళవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోయిని సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా వడ్డె రమేష్, ప్రధాన కార్యదర్శిగా బుర్రి సాంబమూర్తి, సంయుక్త కార్యదర్శిగా పెరుమాండ్ల గౌరమ్మ, కోశాధికారిగా వడ్డె సాంబయ్య ఎన్నికయ్యారు.

ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా రామకృష్ణ



పరకాల: కార్మికులకులకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారం కృషి చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు సోదా రామకృష్ణను పరకాల డిపో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా నియామకం చేస్తూ ఆ యూనియన్ రీజినల్ సెక్రటరీ కె.నాగయ్య తెలిపారు. నియామకపత్రాన్ని యూనియన్ బాధ్యులు మంగళవారం రామకృష్ణకు అందజేశారు. కార్మికుల పక్షాన డిపో యాజమాన్యంతో మాట్లాడుతూ సమస్యల పరిష్కారం తనవంతు కృషిచేస్తానని ఆయన తెలిపారు.

ప్యాడీ క్లీనర్ మిషన్లపై పట్టింపేది?



వేలేరులో కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ప్యాడీ క్లీనర్ మిషన్



పీచరలో ఎండలోనే ఉన్న ప్యాడీ క్లీనర్ మిషన్

- కొనుగోలు కేంద్రాల్లో వృథాగా ఉన్న యంత్రాలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని రైతుల వేడుకోలు

వేలేరు : మండల కేంద్రంతో పాటు పీచర తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పట్టే ప్యాడీ క్లీనర్ మిషన్లు వృథాగా పడి ఉన్నాయి. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే అక్కడ ఉన్న ప్యాడీ క్లీనర్ మిషన్‌లో ధాన్యాన్ని పోసి వడ్లలో ఉన్న తాలును వేరు చేసి నాణ్యమైన వడ్లను మిల్లుకు తరలిస్తుంటారు. గత ఎండాకాలంలో కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మిషన్లు ఇప్పటి వరకు అక్కడి నుంచి తీసి భద్రపర్చకపోవడంతో ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పట్టే అవకాశం ఉంది. అవి పాడవకముందే వాటిని తీసి వేరే చోట భద్రపరిచే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్యాడీ క్లీనర్లను భద్రపరచాలి



ప్యాడీ క్లీనర్లను ఏర్పాటు చేసిన నిర్వాహకులు సీజన్ అయిపోయిన తర్వాత అక్కడే వదిలేయడంతో అవి ఎండకు ఎండుతూ,వానకు తడుస్తూ తుప్పుపట్టాయి. పాడవకముందే సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. – జల్తారి రవి, పీచర రైతు

నిజాయితీ చాటుకున్న కండక్టర్

- బస్సులో మరిచిపోయిన బ్యాగు అందజేత

పరకాల : ఓ ప్రయాణికురాలు ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన బ్యాగును పరకాల ఆర్టీసీ డిపో కండక్టర్ కోడెపాక సాంబయ్య అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు. పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన బిల్లా రాజేశ్వరి అనే ప్రయాణికురాలు పరకాల బస్టాండ్ నుంచి జమ్మికుంటకు వెళ్లే బస్సులో ఎక్కి నాగారంలో తన పిల్లలతో దిగింది. కొద్ది సేపటికే కండక్టర్ సాంబయ్య సీటు వైపు చూడగా ఓ బ్యాగు కనిపించింది. అందులో రూ.30వేల నగదు, మూడు తులాల బంగారం, 20 తులాల వెండితో పాటు మొబైల్ ఫోన్ ఉంది. ఓ ప్రయాణికురాలు బస్సులో మరిచిపోయిన బ్యాగు విషయాన్ని ఆర్టీసీ అధికారులకు తెలిపి వారి ద్వారా బాధితురాలికి అందేలా చేశారు. కండక్టర్ సాంబయ్యను పలువురు అభినందించారు.



బాధితురాలికి బ్యాగును అందజేస్తున్న కండక్టర్ సాంబయ్య

చికిత్స పొందుతున్న మహిళ మృతి

ఆత్మకూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని హౌజుబుజుర్గులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హౌజుబుజుర్గుకు చెందిన నీలం కుమార్ తన భార్య స్రవంతిని తీసుకొని ఆదివారం పొలం పనులకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కటాక్షపూర్ చెరువు మత్తడి వద్ద రోడ్డుపై గుంతలో బైక్ పడిపోతున్న క్రమంలో బ్రేక్ వేయగా బ్రేక్ వైరు తెగి బైక్‌తో సహా కిందపడిపోయాడు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించగా భార్య స్రవంతి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలు తల్లి సౌందర్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- బతుకమ్మ, దసరా ఉత్సవాలపై సమీక్ష సమావేశం

పరకాల : ప్రశాంత వాతావరణంలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలు నిర్వహించుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అనారు. అదేవిధంగా బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో గొడవలకు పాల్పడే వారిపై నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సద్దుల బతుకమ్మ వేడుకలు, నిమజ్జన వేడుకలు జరుపనున్న పరకాల పట్టణంలోని పశువుల సంత, దామెర చెరువు ట్యాంక్‌బండ్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులతో బతుకమ్మ వేడుకలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ఏడాది వర్షపాతం ఎక్కువగా నమోదైనందున చెరువు వద్ద నీళ్లు ఎక్కువగా ఉండి ప్రమాదాలకు చోటుచేసుకునే అవకాశం ఉంది. భక్తులు, చిన్నారులు చెరువులోకి దిగకుండా మున్సిపల్ సిబ్బందితో బతుకమ్మ నిమజ్జన వేడుకలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహాకు సూచించారు. అవసరమైతే సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పెట్రోలింగ్ కూడా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ కె.నారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా, తహసీల్దార్ భాస్కర్, సీఐ క్రాంతికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చెరువు ట్యాంక్ బండ్ వద్ద బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణది



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న అధికారులు

దామెర : పూలను, ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం ఉత్తమ బతుకమ్మకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ఐసీడీఎస్, రెండో బహుమతి ఐకేపీ, మూడో బహుమతి రెవెన్యూ శాఖల మహిళలు తయారు చేసిన బతుకమ్మలకు అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని ప్రతీ ఒక్కరూ గౌరవించాలని అన్నారు. సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, పీఆర్ ఏఈ సమ్మిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ విష్ణుమూర్తి, పాల్గొన్నారు.

కాట్రపల్లిలో అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాయంపేట : మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని సీఎస్ఐబీజేఎం హైస్కూల్‌లో 2013–14లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పరిచయ కార్యక్రమం చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు బోధించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెవరెండ్ సామ్ జార్జ్, ఉపాధ్యాయులు జోయి, అనిల్‌కుమార్, ప్రవళిక, రాజయ్య, రాజునాయక్, సతీష్‌కుమార్, సాయిరెడ్డి, శైలజ, బీజాయి, మాధ్యూలను శాలువా, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : ప్రతి ఒక్కరూ భక్తి భావంతో కలిగి ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో ఎస్‌పీటీ యూత్ ఆధ్వర్యంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తుండగా మంగళవారం ఎమ్మె ల్యే పాల్గొనగా అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారని, ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. యువకులు చెడు వ్యసనాల బారిన పడకుండా భక్తిమార్గంలో పయనిస్తుండడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాష్, శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, నాయకులు రవి, మార్కండేయ, ప్రకాశ్‌రెడ్డి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



శాయంపేట : పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు

దామెర : మండల వ్యాప్తంగా దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తక్కళ్లపహాడ్‌లో మంగళవారం చండీ హోమం నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజా కార్యక్రమాలు చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని దామేశ్వరాలయంలో మహాలక్ష్మీ అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయప్రధాన అర్చకులు నాగిళ్ల రాజుశర్మ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పరకాలలో అన్నదానం

పరకాల: పట్టణంలోని కనకదుర్గమ్మ మదనపోచమ్మ ఆలయంలో దేవి శరన్నవ రాత్రి ఉత్సావాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు లక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం బోయిని పోశాలు, నడిపెల్లి సంపత్‌రావు దంపతులు ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రముఖ వైద్యుడు డాక్టర్ పోతాని రాజేశ్వర ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండి సారంగపాణి, దేవునూరి మేఘనాథ్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరిశెట్టి సాంబశివుడు, నాగెల్లి రంజిత్, ఇంగిళి వీరేష్‌రావు, మూసినపల్లి శివప్రసాద్, కంచం రవి, సత్యం, నిఖిల్, సాయి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కాత్యాయని అవతారంలో దుర్గామాత

ఆత్మకూరు: మండలకేంద్రంలోని పోచమ్మసెంటర్‌లో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గామాత కాత్యాయని అవతారంలో దర్శనమివ్వగా భక్తులు భక్తి శ్రద్ధలతో దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



దామెర : చండీహోమంలో పాల్గొన్న భక్తులు



ఆత్మకూరు: కాత్యాయని అవతారంలో దుర్గామాత



పరకాల : అన్నదానం ప్రారంభిస్తున్న రాజేశ్వరప్రసాద్

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న వెంకటస్వామి



కమలాపూర్ : మాట్లాడుతున్న సంపత్

ఎల్కతుర్తి : ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టడం ముమ్మాటికి మాదిగలను, ఉపకులాలను మోసం చేయడమే అంటూ బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టబోయే హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాట్ల వెంకటస్వామి నాయకులకు పిలుపునిచ్చారు. మంగళవారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో సుప్రీంకోర్టు తీర్పు స్వాగతించినా సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ లేకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టడం మాదిగలను, ఉపకులాలను మోసం చేయడమే అని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, రేవంత్‌రెడ్డి మోసాన్ని ఎండగడుతామన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నక్క సునిల్, రేణికుంట్ల భిక్షపతి, మాడుగుల హిమ్రా, సదానందం, ప్రభుదాస్, కోటి, కర్ణాకర్, జయరాజ్, కళాదర్, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్: ఎస్సీ వర్గీకరణ చేస్తానని అసెంబ్లీలో మాట ఇచ్చి తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 9న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు చిలువేరు సంపత్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ మండల ఇన్‌చార్జ్ శనిగరపు రవీందర్, మండల అధ్యక్షుడు నద్దునూరి ప్రసాద్, నాయకులు కిరణ్, భూమయ్య, రాజమల్లు, శ్రీనివాస్, సుధాకర్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో పాగా వేయాలి

హసన్‌పర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయాలని దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పిలుపునిచ్చారు. 66వ డివిజన్ హసన్‌పర్తిలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ దేశంలోనే అధిక సభ్యత్వాలు కలిగి ఉన్న ఏకైక పార్టీ బీజేపీ అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ కుమారస్వామి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మొరం తరలిస్తే చర్యలు

దామెర: మొరం, మట్టి తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎస్సై కొంక అశోక్ తెలిపారు. మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న రెండు మొరం టిప్పర్లను పట్టుకొని మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని సింగరాజుపల్లి శివారు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నారు. కాగా మండల కేంద్రంలో పోలీసులు తనిఖీ చేయగా టిప్పర్ నంబర్ టీఎస్ 02 యూసీ 9805, టీఎస్ 23టీ 3583ల ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్నట్లు గుర్తించారు. సదరు యజమానులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



పోలీసులు పట్టుకున్న టిప్పర్

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

నడికూడ : మండలంలోని పులిగిల్ల గ్రామ శివారులోని చెరువు సమీపంలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం మేరకు మంగళవారం పరకాల పోలీసులు అక్కడికి వెళ్లగా చెట్టు కింద 9 మంది పేకాట ఆడుతున్నారు. వీరి నుంచి నగదు రూ 11,200, నాలుగు సెల్ ఫోన్‌లు, 6 బైక్‌లు, ఒక్క ఆటో, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. బరిగెల వెంకటేష్, అల్ల మహేందర్, మార్ల కైలాసం, దుగ్యాల వీరన్న పట్టుపడగా, బొమ్మని ఓదెలు, భాషబోయిన నాగరాజు, దయ్యాల రాజు, పర్ష ఎల్లస్వామి, దయ్యాల విష్ణు వారు పరారయ్యారు. నిందితులను పరకాల పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ క్రాంతి కుమార్, ఎస్సై రమేశ్‌లు తెలిపారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్సై

వితంతువులు ధైర్యంగా ఉండాలి

కాజీపేట రూరల్: యువ వితంతువులు ధైర్యంగా ఉండాలని జనవికాస ప్రెసిడెంట్ లూర్థు మర్రెడ్డి అన్నారు. కాజీపేట బాలవికాస ట్రైనింగ్ సెంటర్‌లో వితంతువులు, వారి పిల్లలకు జనవికాస సంస్థ మంగళవారం చేయూతనందించింది. ఈ సందర్భంగా మర్రెడ్డి మాట్లాడుతూ జనవికాస తరఫున వేలాది మంది పేద వితంతువులకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళా అభివృద్ధి పథకం ప్రోగ్రాం మేనేజర్ లత మాట్లాడుతూ ఏ కష్టం వచ్చిన వితంతువులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు. రూ.12 లక్షల విలువగల సామగ్రిని అందించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మడికొండ: గంజాయి, గుట్కా, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని మడికొండ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కిషన్ సూచించారు. మంగళవారం రాత్రి మడికొండ పోలీసుస్టేషన్ పరిధిలోని భట్టుపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై పోలీసు కళాజాత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని చెప్పారు. సైబర్ మోసగాళ్ల వలలో పడి ఆర్థికంగా నష్టపోవద్దని అన్నారు. ఎస్సై రాజబాబు, హెడ్ కానిస్టేబుళ్లు జయరాజ్, రాంచందర్, కళాబృందం ఇన్‌చార్జ్ ఎస్సై నాగమణి, విలియం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కిషన్